క్లుప్తంగా

ఆర్టీసీ డిపో ఆధునికీకరణ పనులు పరిశీలన



ఆర్టీసీ డిపోలో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న అధికారులు

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపోను ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ బ్రహ్మానందరెడ్డి, చీఫ్ మెకానికల్ ఇంజినీర్ శ్రీనివాసరావులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో సుమారు రూ.12 లక్షలతో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బస్సులు చాలని రూట్లకు అదనంగా బస్సులను ఏర్పాటుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మూర్తి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాసేవకు గుర్తింపు



ఉత్తమ కరెస్పాండెంట్ పురస్కారాన్ని శ్రీనుకు అందజేస్తున్న అతిథులు

పార్వతీపురం: విద్యారంగంలో చేసిన విశేష సేవలకు గాను పార్వతీపురంలోని శ్రీజన్ పాఠశాల కరెస్పాండెంట్ ఉప్పిలి శ్రీను ఉత్తమ కరెస్పాండెంట్ పురస్కారాన్ని ప్రపంచ విద్యార్థి దినోత్సవం సందర్భంగా అందుకున్నారు. ఈ మేరకు గజపతినగరంలో శుక్రవారం నిర్వహించిన బాలాజీ విద్యాసంస్థల శ్రీ సత్యసాయి దివ్యామృతం కార్యక్రమంలో భాగంగా ఉప్పిలి శ్రీనుకు అవార్డు అందజేశారు. దామోదరం సంజీవయ్య, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి డి. సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులునాయుడు, విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కరరెడ్డి చేతుల మీదుగా శ్రీనుకు పురస్కారం అందజేశారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు: పట్టణంలోని వెలమపేట అక్కేన వీధి రామమందిరం వద్ద గౌరీశంకర మహోత్సవంలో భాగంగా శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చి నందెమ్మ తీర్థప్రసాదాలను స్వీకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

కొత్తమ్మతల్లికి వెండికిరీటం వితరణ



వెండికిరీటంతో భక్తులకు దర్శనమిస్తున్న కొత్తమ్మతల్లి

సాలూరు: పట్టణంలోని మెంటాడ వీధిలో కొలువైన కొత్తమ్మ తల్లికి మానేపల్లి ఈశ్వరరావు, కుటుంబసభ్యులు, బంధువులు వెండి కిరీటం శుక్రవారం వితరణగా ఇచ్చారు. సుమారు రూ.2 లక్షల 50 వేల విలువ చేసే కిరీటాన్ని అమ్మవారికి బహూకరించగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల పరిశీలన



దళాయివలస వాటర్ ఫాల్ వద్ద నిర్మాణం చేసిన వంతెనను పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ సుధారాణి

సాలూరు రూరల్: మండలంలోని దళాయివలస, శిఖపరువు గ్రామాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన జలపాతాలను డీఆర్డీఏ పీడీ సుధారాణి శుక్రవారం పరిశీలించారు. దళాయివలసలో గిరిజనులు రెండు రాళ్ల మధ్యలో నీటిపై వెదుళ్లతో వంతెన నిర్మాణం చేశారు. అక్కడ పర్యాటకులకు అవసరమైన తినుబండారాల కోసం ఏర్పాటు చేసిన రెండు దుకాణాలను ఆమె పరిశీలించారు. కార్తీక మాసంలో పర్యాటకులకు ఈ ప్రాంతాలు మంచి అహ్లాదకర వాతావరణాన్ని అందిస్తాయని డీఆర్డీఏ పీడీ సుధారాణి అన్నారు.

పేదల వైద్యవిద్య ప్రైవేటుకు ధారాదత్తం

- మాజీ ఎమ్మెల్యే జోగారావు



గంగాడలో సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అమలులోకి తీసుకువచ్చిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పేదవాడికి అందుబాటులో లేకుండా ప్రైవేటుకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోంది. దానిని అడ్డుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టారని, అందులో భాగంగానే సంతకాల సేకరణ నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని గంగాడ, శ్రీరంగరాజపురం, గలావల్లి గ్రామాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడికి విద్యవైద్య దూరకాకూడదనే దూరదృష్టితో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. అయితే వాటిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నందున దానిని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. వైద్యవిద్య ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరమవుతుంది. ఫీజులు భరించలేనంతగా పెరుగుతాయి. ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో లేకుండా పోతుంది. పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఉచిత సూపర్ స్పెషాల్టీ సేవలు దూరమవుతాయి. ప్రజారోగ్య వ్యవస్థ క్షీణిస్తుంది. లక్షల కోట్లు విలువ చేసే ప్రజల ఆస్తులు ప్రైవేటు పరం అవుతాయి. ఇంతటి నష్టం కలిగే ఇటువెంటి చర్యలను పార్టీపరంగా అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ పూర్తిచేసి రాష్ట్ర గవర్నర్‌కు అందించనున్నట్లు తెలిపారు. పార్వతీపురం నడిబొడ్డున నిర్మాణం చేపట్టిన మెడికల్ కాలేజీని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా వదిలేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.లక్ష్మి, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, జిల్లా ప్రధానకార్యదర్శి టి.ప్రసాద్, జి.సూర్యనారాయణ, ఎంపీటీసీ శంకరరావు, కె.దాలినాయుడు, మాధవనాయుడు, పి.మోహనరావు, సూరపునాయుడు, యడ్ల తౌడు, కె.రమేష్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల అభివృద్ధికి పక్కా ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

- ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

పార్వతీపురం రూరల్: జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల బలోపేతమే లక్ష్యంగా పక్కాప్రణాళికతో ముందుకెళ్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకదుర్గ స్పష్టం చేశారు. విజయవాహిని ఫౌండేషన్ సహకారంతో సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీడీ కనకదుర్గ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో త్వరలోనే అంగన్వాడీ ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. చిన్నారుల పెరుగుదల, పర్యవేక్షణలో వెనుకబడిన ప్రాజెక్టుల పనితీరును మెరుగు పరిచేందుకు ప్రత్యేక సూచనలు జారీ చేశామని తెలిపారు. పోషకాహార లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి వారి సంఖ్యను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వీసీఎఫ్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం వివరించారు. సమావేశంలో ప్రధానమంత్రి మాతృ సమృద్ధియోజన, బాలల సంరక్షణ చట్టాలపై కూడా సిబ్బందికి అవగాహన కల్పించారు.

సీజేఐపై దాడిని ఖండిస్తూ ఎంఆర్పీఎస్ నిరసన



తహశీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

పార్వతీపురం రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడికి వ్యతిరేకంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్పీఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలో భాగంగా నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గొడబ ప్రభాకరరావు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానంలోని దళిత న్యాయమూర్తిపై దాడి జరగడం దారుణమన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితుడైన న్యాయవాది రాకేష్ కిశోర్‌ను, అలాగే ఈ దాడి వెనుక ఉన్న శక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితులకు రాజ్యాంగ పరమైన రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గుంట గంగరాజు, కాగాన సాల్మాన్, గుంపస్వామి, ప్రసాద్, చెన్ని, రామారావు, చరణ్, సుందరరావు, మాత రమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సామాజిక పరమైన అభివృద్ధి పనులు చేపట్టడానికి పాలక వర్గాలే సొంతంగా నిధులు సమకూర్చుకోవాల్సి ఉందని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో వనరులు సమర్చుకోవడమెలా అనే అంశంపై శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోతున్న సామాజిక పరమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రణాళికలు తయారు, నిధులు సమకూర్చడం, పనులు ఏవిధంగా చేపటాలన్న అంశంపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. అలాగే నిధులు సమకూర్చడంపై కార్యాచరణ రూపొందించుకుని సమకూర్చడానికి పంచాయతీ పాలకులతో చర్చించి పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మాస్టర్‌ట్రైనీలు పాల్గొన్నారు.

ఆర్వోబీపై చీకటి

సీతానగరం: మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై ఉన్న చెత్తను తొలగించి వీధిలైట్లు వేయక పోవడంతో పాదచారులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. పెదభోగిలి మేజర్ పంచాయతీ పరిధి అప్పయ్యపేట, సీతానగరం గ్రామాల మధ్య ఆర్వోబీ నిర్మాణం జరిగింది. రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ లైన్ వేసి ప్రమాదాల నివారణకు వీధిలైట్లు వేశారు. అప్పట్లో వేసిన వీధిలైట్లు పాడవగా కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కాలమైనా ఇంతవరకూ లైట్లు వేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాహన చోదకులు ఆరోపిస్తున్నారు.
వీధిలైట్లు వేయాలని పలుమార్లు పంచాయతీ పాలకులు, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకూ పట్టించుకోలేదని వాపోతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయని ఇటీవల సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఆర్ అండ్‌బీ అధికారులు గోతులు పూడ్చారు. రోడ్డుకు ఇరువైపులా పేరుకు పోయిన చెత్తకుప్పలను తొలగించారు. పంచాయతీ అధికారులు వీధిలైట్లు వేయడం లేదని, తక్షణమే వీధిలైట్లు వేయాలని రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

సీతానగరం: మండలంలోని రెండు గ్రామాల వ్యాధిగ్రస్థులకు ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి మంజూరుచేసిన ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే బి విజయ చంద్ర శుక్రవారం పంపిణీ చేశారు. ఈ మేరకు మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వావిలపల్లి ఆదినారాయణ కుటుంబసభ్యులకు రూ.25.166లు, కృష్ణారాయపురం గ్రామానికి చెందిన వాకాడ కౌశిక్ కుటుంబ సభ్యులకు రూ40.114లు చెక్కును అందజేశారు.

పంటపొలాల్లోనే ఏనుగుల సంచారం

పార్వతీపురం రూరల్: గడిచిన నెల రోజులుగా పంట పొలాలను ధ్వంసం చేస్తూ పార్వతీపురం మండలంలో ఏనుగులు సంచరిస్తున్నాయి. ఏనుగుల గుంపు శుక్రవారం చొక్కాపువానివలస నుంచి చినమరికి, బండిదొరవలస గ్రామాల వైపు వెళ్లి రెండు గ్రామాలకు మధ్యలో ఉన్న పంట పొలాల్లో తిష్టవేసి చేతికొచ్చే దశలో ఉన్న పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అలాగే గ్రామాల సమీపంలో, పంట పొలాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తుండడంతో రైతులు, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది సూచనలు జారీ చేస్తున్నారు.

పోలింగ్ స్టేషన్లపై అవగాహన సదస్సు



పోలింగ్ స్టేషన్లపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి బి.రాజశేఖర్

సాలూరు రూరల్: మండల ఎన్నికల అధికారి బి.రాజశేఖర్ శుక్రవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్ల గురించి తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 1200మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ స్టేషన్ల మార్పు గురించి రాజకీయ పార్టీలకు వివరించారు. సాలూరు నియోజకవర్గంలో మార్పుచేయాల్సి ఉన్న పోలింగ్‌స్టేషన్ల వివరాలను వారికి తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రయోజనాలపై అవగాహన

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పెదమేరంగి గ్రామంలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం వారి గృహ విజ్ఞాన విభాగం పరిశీలనలో చిరుధాన్యాల ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఆమె తెలిపారు.

ఆస్పత్రి బాట పట్టిన విద్యార్థులు



ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

- తల్లిదండ్రుల్లో ఆందోళన



విద్యార్థులను పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: అనారోగ్యాలతో విద్యార్థులు ఆస్పత్రుల బాటపడుతున్నారు. సాలూరు నియోజకవర్గంలోని బొడ్డవలస.పి.కోనవలస, మక్కువ తదితర ప్రాంతాల్లోని పాఠశాలలు, సంక్షేమ ఆశ్రమ, గురుకుల హాస్టల్స్‌లో చదువుతూ అనారోగ్యానికి గురైన సుమారు 20 మందికి పైగా విద్యార్థులు సాలూరు ఏరియా ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. నియోజకవర్గంలోని పాచిపెంట మండల కేంద్రం కేజీబీవీలో చదివిన మక్కువ మండలం నంద గ్రామానికి చెందిన బిడ్డక కీర్తన ,మామిడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని తాడంగి పల్లవి, మక్కువ మండలం ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలకు చెందిన తాడంగి చిన్నారి ఇటీవల అనారోగ్యాలతో మరణించిన విషయం పాఠకులకు విదితమే. జిల్లాలో, నియోజకవర్గంలో విద్యార్థుల మరణాలు సంభవిస్తున్న క్రమంలో, అనారోగ్యాలకు గురైన విద్యార్థుల ఆరోగ్యం మళ్లీ కుదుటపడే వరకు తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.పిల్లలు ఉన్నతస్థాయికి ఎదగడం పక్కన పెడితే ముందు సజీవంగా బతికి ఉంటే భవిష్యత్తులో వారే ఉన్నతస్థాయికి ఎదుగుతారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కాగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శుక్రవారం స్త్రీశిశుసంక్షేమ,గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

వరిలో తెగుళ్లతో ఉసూరుమంటున్న రైతులు



వరిచేను మొదళ్లలో ఆశించిన దోమ పోటుతో ఎండిన వరిచేను

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో మండలంలో రైతులు సాగు చేస్తున్న వరిచేను పంటకు వివిధ రకాల తెగుళ్లు సోకడం వల్ల పంటలను చూసిన రైతులు భోరున విలపిస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అధికారికంగా సిఫార్స్ చేసిన ఎంటీయు 1064, సోనామసూరి, ఎంటీయూ 1121 రకాల వరివిత్తనాలు కొద్దిపాటి రాయితీపై పంపిణీ చేసిన వరివిత్తనాలు, వరివెదలు రైతులు వేయడంతో ఏపుగా పెరిగాయి. రైతులు తీసుకున్న జాగ్రత్తల కారణంగా వరిచేలు ఏపుగా పెరగడంతో ఆశించిన పంటదిగుబడి వస్తుందన్న భావిస్తున్న సమయంలో తెగుళ్లు సోకడంవల్ల పంటకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.ప్రభుత్వ వ్యవసాయ శాఖ మూడు సంవత్సరాల క్రితం ఇక్కడి భూముల వాతావరణానికి అనుగుణంగా సిఫార్స్ చేసిన వరివిత్తనాలు మార్పిడి చేయకపోవడం వల్ల ఈ ఏడాది కూడా అవే విత్తనాలు వేయడంతో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నందున పంటలకు నష్టం వాటిల్లనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్లెదుటే వరిచేను పంటకు నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. వరితెగుళ్లకు గురైన పంటలను అధికారులు పరిశీలించి పరిహారం వచ్చేలా చూడాలని, పురుగు మందులు ధరల నియంత్రణపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. వరిలో ఆశించే తెగుళ్ల నివారణ, రైతుల ఇబ్బందిపై మండల ఏఓ ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా వరిలో ఎండు ఆకు సోకితే కాపర్ ఆక్సీక్లోరైడ్ స్ట్రెప్టో సైక్లిన్ పిచికారీ చేయాలని, దోమ పోటు సోకితే థియోమెథాక్సాంలేదా అసిఫేట్‌లేదా పైమీట్రోజోన్ మందును పిచికారీ చేయాలని సూచించారు.

'గిరి'బిడ్డల ప్రాణాలకు రక్షణేదీ?



మెడకు ఉరితాళ్లు, మృతిచెందిన విద్యార్థుల ఫొటోలు, ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వివిధ ప్రజా, గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు

- కలెక్టరేట్ ఎదుట మెడకు ఉరితాళ్లతో వినూత్న నిరసన

పార్వతీపురం రూరల్: గిరిజన విద్యార్థుల వరుస మరణాలపై ప్రజా, గిరిజన సంఘాలు జిల్లా కేంద్రంలో శుక్రవారం తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశాయి. విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, మరణాల పరంపరకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఐదు రోజులుగా చేపట్టిన రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద వివిధ సంఘాల నాయకులు, తల్లిదండ్రులు వారి మెడలకు ఉరితాళ్లు వేసి వినూత్నంగా తమ ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవికుమార్‌లు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే కూటమి పాలకులకు లెక్కలేకుండా పోయిందంటూ ధ్వజమెత్తారు. గిరిజన విద్యార్థుల భద్రత విషయంలో బాధ్యతారాహిత్యంగా, నిర్లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో సురక్షిత తాగునీరు, పౌష్టికాహారం అందించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. గిరిజన మంత్రి తొలి సంతకం చేసిన ఏఎన్ఎంల నియామకాన్ని తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ రాష్ట్ర కమిటీ సభ్యుడు విశ్వనాథ్, సీపీఐ కార్యదర్శి మన్మథరావు, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు పి.సంగం, వివిధ ప్రజా గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఓ ప్లాంట్లను అందుబాటులోకి తేవాలి

- ఆదివాసీ గిరిజన సంఘం కార్యదర్శి రామస్వామి



రావికోన ఆశ్రమ పాఠశాలలో మూలకు చేరిన ఆర్ఓ ప్లాంట్‌ను చూపిస్తున్న రామస్వామి

పార్వతీపురం రూరల్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం అటకెక్కింది. అధికారులు, కూటమి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. పార్వతీపురం మండలం రావికోన ఆశ్రమ పాఠశాలలో గత ప్రభుత్వంలో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన శుద్ధజల(ఆర్ఓ) ప్లాంట్ కొన్ని నెలలుగా మరమ్మతులకు నోచుకోక స్టోర్ రూమ్‌కే పరిమితమైంది. దీంతో విద్యార్థులు కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలవుతున్నా యంత్రాంగంలో చలనం లేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, స్థానిక సర్పంచ్ కద్రక రామస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే 15మంది విద్యార్థులు విషజ్వరాలు, పచ్చకామెర్లతో మృతిచెందిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆశ్రమాల్లో ఏఎన్ఎంలను నియమిస్తామన్న గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ 16 నెలలైనా నెరవేరలేదని, ఆమె సొంత నియోజకవర్గంలోనే ఈ దుస్థితి దాపురించిందని విమర్శించారు. కురుపాం గురుకులంలో 150మందికి పైగా చిన్నారులు గత నెలరోజులుగా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చాలీచాలని గదులతో రావికోన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వరండాల్లో చదువులు, నిద్ర సాగిస్తున్నారని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆర్ఓ ప్లాంట్‌ను బాగు చేయించి అదనపు గదులు నిర్మించాలని, లేని పక్షంలో విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


- జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి



దోకిశీల ఆశ్రమ పాఠశాలలో కాలువను పరిశీలిస్తున్న జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చునని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన డోకిశీల గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శుక్రవారం వసతిగృహాల చుట్టూ నీరు నిల్చిపోయే ప్రాంతాలను, చెత్తను, పాత వస్తువులను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిసరాలను పొడిగా ఉంచడమే డ్రైడే లక్ష్యమన్నారు. పరిశుభ్రత ప్రాధాన్యంపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

తోటపల్లి ఆలయ ఈవోగా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకోదండరామస్వామి ఆలయాల ఈవోగా బి.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వెలువడగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం శ్రీనివాస్ మక్కువ మండలంలోని శంబర పోలమాంబ ఆలయ ఈవోగా పనిచేస్తుండగా తోటపల్లి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని, దైవదర్శనానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

సాలూరు రూరల్: మండలంలోని రేగాపువలస గ్రామంలో శుక్రవారం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డా.ప్రశాంత్ గిరిజనులకు క్షయవ్యాధిపై అవగాహన నిర్వహించారు.అనంతరం తోణాం పీహెచ్‌సీని పరిశీలించారు.